




**హాస్యం అనగానే తెలుగువాడికి ప్రథమంగా గుర్తుకు వచ్చేది బాపు, రమణలే. ఈ పత్రిక నిర్వాహకులు, సంపాదకవర్గం అందరూ బాపురమణల అభిమానులే కాబట్టి ప్రతీసంచికలోనూ 'బాపూరమణీయం' మిమ్మల్ని పలకరిస్తూనే ఉంటుంది.**





బాపురమణ - అందమైన ద్వంద్వ సమాసం అనేది కొత్తగా చెప్పనవసరం లేదు. వారి స్నేహానికి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా 1995లో 'బొమ్మా - బొరుసూ' పుస్తకం వెలువడింది కూడా. అనేక విషయాలలో పట్టనట్టు ఉండే ప్రభుత్వం కూడా వారిద్దరినీ విడదీయడం ఇష్టంలేకనే ఇద్దరికీ కలిపే అవార్డులు ఇచ్చింది. బాపు కంటే రమణ ఒకటిన్నర సంవత్సరం పెద్ద. ఇద్దరూ మద్రాసులో పెరిగారు. 1945లో 'బాల' పత్రికలో రమణ తొలిరచన, బాపు తొలిచిత్రం అచ్చయ్యాయి. ఆ తర్వాత వారిద్దరూ కలసి ఒక లిఖిత మాసపత్రిక సైక్లోస్టైయిల్ సహాయంతో నడిపేరు - ఆ తర్వాత 'జ్యోతి' మాసపత్రిక (1963) లో సంపాదక వర్గంలో కలిసి ఉన్నారు. 1967లో 'సాక్షి'తో సహనిర్మాతలయినారు. కష్టాలూ, సుఖాలూ కలసి పంచుకున్నారు. ప్రస్తుతం ఒకే ఇంట్లో కిందా పైనా ఉంటున్నారు.

'వీరిద్దరికీ ఒకరిపట్ల మరొకరికి ఎలాంటి భావం ఉంది?' అన్న ప్రశ్న అభిమానులను వేధిస్తూంటుంది. అసలు ఇద్దరి మధ్య స్నేహం ఇన్నాళ్లు ఎలా మనగలిగింది? పోట్లాడుకోరా? అన్న సందేహం కూడా కలుగుతుంది. రమణ గారిని ఇదే ప్రశ్న అడిగితే 'మేం ఇద్దరం ఇన్నాళ్లు స్నేహంగా ఉంటామని బాండ్ రాసుకోలేదు, మేం ఒకరితో ఒకరం విభేదించుకుని, వాదించుకున్న సందర్భాలు ఉన్నాయి'. అన్నారు ఒక ఇంటర్వ్యూలో. అంటే స్నేహం నిలవడానికి ఇద్దరి అభిప్రాయాలూ, అలవాట్లూ ఒకేలా ఉండనవసరం లేదన్న మాట. స్నేహం గాని, దాంపత్యం గాని కలకాలం నిలబడాలంటే ఉండాల్సింది -'ఒకరి పట్ల ఒకరికి నమ్మకం, గౌరవం, అభిమానం'. అవి పుష్కలంగా ఉన్నాయి కాబట్టే బాపురమణల స్నేహం హాయిగా కొనసాగుతోంది. రమణ రచనలంటే బాపుకి ఇష్టం, బాపు బొమ్మలంటే రమణకి ఇష్టం. ఇద్దరూ సరిసమానమైన హోదాలో ఉన్నట్టు కనబడినా నిజానికి రమణ 'పెద్దరికం' వహిస్తారు. తన తరఫున, బాపు తరఫున లోక వ్యవహారాలు చక్కబెట్టేది రమణే! బాపు వాళ్లమ్మగారి గురించి రాస్తూ ఓసారి రాశారు. 'నేను 'సీతాకళ్యాణం' సినిమా సందర్భంగా లండన్‌కి వెళుతూంటే మా అమ్మ అంది - నీకేదైనా పేరు వచ్చిందంటే అదంతా రమణవల్లనే. అతని కాళ్లకు దండం పెట్టు' అని. నేను రమణ కాళ్లకు నమస్కరించే విమానం ఎక్కాను.'

అంతేకాదు బాపు వాళ్లబ్బాయికి వెంకటరమణ అని పేరు పెట్టుకున్నారు కూడా.

మరి రమణకు బాపు పట్ల ఉన్నది వాత్సల్యం మాత్రమేనా? దానికి సమాధానం ఇటీవలే విడుదలైన కథా రమణీయం-1లో దొరుకుతుంది.

రమణ రచనలన్నిటినీ 7 వాల్యూములుగా విశాలాంధ్ర వారు ప్రచురిస్తున్నారు. మొదటి సంపుటం కథారమణీయం-1 గా జనవరి 6న విడుదలైంది. ఆ సంపుటాన్ని బాపుకి అంకితం ఇస్తూ రమణ ఏమన్నారో చూడండి. నా కథా నాయకుడు అనడంలో ఎంతో ఔచిత్యం ఉంది. రమణ కథలు రాస్తానని అనడమే తప్ప కలం పట్టే సాహసం చేయకపోవడంతో బాపు ఓ కథ రాసి రమణ పేర పంపించారు. ఆవిధంగా రమణ పేర అచ్చయిన తొలి కథ యొక్క ఘోస్ట్‌రైటర్ బాపు. తొలి నాళ్లలోనే కాదు, తర్వాత కూడా ఒక్కోసారి కొత్త ఐడియా కోసం రమణ మథన పడుతూన్నప్పుడు ముందుగా బొమ్మ వేసి ఇచ్చి కథ ముందుకు నడిపేది బాపుయే. అన్నట్టు వీరిద్దరు బంధువులు కూడా. రమణ అబ్బాయికి బాపు సోదరుడి కుమార్తెనిచ్చారు. అంతటి అనుబంధం ఉంది కాబట్టే బాపూరమణీయంలో అంతటి రామణీయకత! ★

బాపూ రమణల స్నేహబృందంలో ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం ఒకరు. వయస్సులో వారికంటే చిన్నవాడైనా బాలు అంటే వారికి ఎంతో ఆదరాభిమానాలే కాక గౌరవం కూడా! 'మాకు ఆయన పరిచయం కలగడం భగవంతుడిచ్చిన వరం' అని పబ్లిగ్గా అనేటంత గౌరవం అన్నమాట!!.

బాలూ చక్కటి గాయకుడిగా పేరు తెచ్చుకున్నాక, సంగీత దర్శకుడిగా కూడా తన ప్రతిభను చూపించే ప్రయత్నం చేశారు. ఆ రోజుల్లో అంటే 1979లో 'తూర్పువెళ్ళే రైలు' సినిమాకి సంగీతాన్ని అందించే బాధ్యతను బాలూకిచ్చారు బాపూ రమణలు. వారి కాంబినేషన్‌లో అద్భుతమైన పాటలు రూపు దిద్దుకున్నాయి. బాలూకి తొలిసారి ఉత్తమ సంగీత దర్శకుడి అవార్డు ('సినీ హెరాల్డ్'వారిది)ని సంపాదించి పెట్టాయి. "ఆసినిమాలో 'చుట్టూ చెంగావి చీర'








పాటకి బాపూగారు 'రఫ్ తా రఫ్ తా' గజల్ వినిపించి దాన్ని అనుసరించమన్నారు. చక్కటి పాట తయారయింది" అంటారు బాలు-తన సంగీతంలో వారి పాత్ర గురించి చెబుతూ!

తెలుగులోనే కాదు హిందీ చిత్రసీమకు వెళ్ళినప్పుడు కూడా బాపు రమణలు బాలూను వెంట తీసుకెళ్ళారు. 'హమ్ పాంచ్' సినిమాకి బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్ బాలూ చేత ఇప్పించారు. 'బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్ స్కోర్డ్ బై యస్.పి. బాలసుబ్రహ్మణ్యం' అని టైటిల్స్‌లో వేయించారు. బాలూ సర్వతోముఖ ప్రతిభను ఎలా వాడుకోవాలో బాపు రమణలకు బాగా తెలుసు. 'జాకీ'(ఓ స్వారీ చేసే నారీ'పాటలో బాపూ గారు అడిగి మరీ ఈలపాట రఘురామయ్యలా గమకం తీయించారు) 'సీతమ్మ పెళ్ళి' సినిమాలకు మ్యూజిక్ డైరెక్షన్ అప్పగించడమే కాక 'వంశ వృక్షం' ద్వారా తెలుగు వాళ్ళకి అనిల్‌కుమార్‌గా పరిచయమైన బాలీవుడ్ హీరో అనిల్ కపూర్‌కి బాలూ చేత డబ్బింగ్ చెప్పించారు.

వీరి మధ్య అల్లుకున్న స్నేహలత మరొక మొగ్గవేసింది ఇటీవలే! దాని పేరే 'లీలా జనార్దనమ్'! రమణ గారి వ్యాసంతో బాపూ బొమ్మలతో (వేరే విశేషణాలు అక్కర్లేదు) రూపొందించిన ఈ అరుదైన పుస్తకాన్ని ఒక కలక్టర్స్ ఐటమ్‌గా ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం సమర్పించారు.

ఆ పుస్తకం ఇంట్రోలో బాలూ సహృదయాన్ని, సరసహృదయాన్ని చక్కటి మాటల్లో ఆవిష్కరించారు రమణగారు-'బాలు గోపాలుడికి మేలు మేలు' అంటూ!

"...ఇంతకు ముందు-మూడు పుష్కరాల" నాడు జనార్దనాష్టకం పేరిట బాపు చిత్రాలు వేశారు. దానిని ఆనంద కావ్యమాల ప్రచురణగా -శ్రీ వి.ఎ.కె. రంగారావు గారు ప్రచురించారు. తిరిగి ఇన్నాళ్ళకు శ్రీ బాలుగారు పూనుకొని బాపుగారిచే మరల చిత్రకల్పన చేయించారు. ఈ రాగ రంజిత ప్రబంధాన్ని 'లీలా జనార్దనం' పేరిట సమర్పిస్తున్నారు.

ఆ నాడు రాజులూ ఈ నాడు ప్రజలూ కళాపోషకులు. కానీ ఒక కళాకారుడు మరొక కళను ఈ విధంగా ఆదరించి గౌరవించడం విశిష్టం.

ఒక ఊర్వశి ఒక తిలోత్తమను మెచ్చుకోవడం... ఒక వేణువు మరొక



వేణువుతో శ్రుతి కలపడం.. ఒక రాగం అనురాగంతో జతి కలపడం.. ఆ బాలగోపాలుని చేతివేణువై వెలిగే ఈ బాలుగోపాలునికి మేలు మేలు.

ఒక రచయితగా నావందనాలు.

ఇవీ ఆ ఇంట్రోలో కొన్ని భాగాలు.

రమణ వాడిన 'బాలగోపాలుని చేతి వేణువై వెలిగే' అన్న వర్ణన ఖచ్చితంగా బాలూను పులకింపచేసి ఉంటుంది. ఎందుకంటే రమణ రాసిన 'కానుక' బాలూకి అతి ఇష్టమైన కథ ...! ఆ కథలో నాయకుడు శ్రీకృష్ణుడి బాల్య మిత్రుడు. తన మిత్రుని పుట్టిన రోజు కానుకగా అతడు ఒక శ్రుతిశుద్ధమైన వేణువును తయారు చేయడానికి ఒక జీవిత కాలం వెచ్చిస్తాడు. చివరిలో సృష్టిలో పనికిరాని వస్తువు ఏదీ లేదనీ, తాను తిరస్కరించిన వేణువులన్నింటినీ సంస్కరించగల శక్తి ఆ కృష్ణభగవానుడికి ఉందనీ గ్రహిస్తాడు.



బాలూకి ఆ కథ కంఠోపాఠం. ఆ కథను ఉద్వేగంతో మిత్రులకు చదివి వినిపించడం ఆయన కిష్టం.

బాలూకు, ఫ్లూటుపై అంత ప్రేమ ఉండడానికి కారణం ఆయన స్వతహాగా ఫ్లూటిస్టు కనుక. ఫ్లూట్ వాయించే రోజుల్లో ఎస్.జానకి సలహాపై తన రూటు మార్చుకుని గాయకుడి మార్గంలో ముందుకి సాగి పేరు ప్రఖ్యాతులు తెచ్చుకున్నారు. అయినా ఇప్పటికీ ఫ్లూటు వాయిస్తారాయన.

ఈ పుస్తకంలో బాపు బొమ్మలకు రమణ రాసిన 'శృంగార శాఖా చంక్రమణం' వ్యాసాన్ని అదనపు ఆకర్షణగా అందరికీ అందుబాటులోకి తెచ్చిన బాలుకి వేణుగానలోలుని భక్తులందరి తరఫున అభినందనలు!.